# కొత్త తీర్పు

## చెన్నా రామమూర్తి



పల్లె నిదురలేవలేదు.

కోడికూతకు ఇంకోజాము సమయముంది.

మినుకు మినుకు మంటున్న చుక్కలతో పరచుకొన్న ఆకాశం, చిమ్మచీకటిని అలముకొన్న నదిజాముతో దోబూచులాడుతోంది.

సత్యనారాయణ చింతాక్రాంతుడై తన చెక్కకుర్చీలో కూర్చున్నాడు. ఆలోచనలు చెల్లాచెదురైపోతున్నాయి. అందుబాటులోకి వచ్చేలా లేవు. మనసునిండా ప్రశ్నలే... మెదడు నిండా ఆలోచనలే...

కనకమ్మ సత్యనారాయణకు ఎదురుగా ఉన్న స్తంభం దగ్గర వక్కనములుతూ కూర్చుంటూ ఆయనవైపు చూసింది. భయపడింది.

"ఎనభై ఏండ్ల మనిషి...ఎప్పుడూ ఆలోచనల్లోనే ఉంటే...ఆయన మనిషిగా బతగ్గలడా...!" అనుకుంది. ఆయన గురించి కొంచెం ఆలోచించింది.

సత్యనారాయణంటే సత్యానికి మారుపేరు. మనిషి ఐదున్నరడుగులు. కాస్తంత నలుపు. జుట్టంతా తెలుపు. కొంచెం లావు. మంచి యోచనాపరుడు. దాన్ని దాఖలా చేసే అర్ధచంద్రాకారపు బట్టతల, కళ్ళకు నల్లఫ్రేమున్న మందమైన తెల్లఅద్దాలు....సంగీతమంటే చెవికోసుకునే రకం. హార్మోనియం ముందు నిలబడి "జెండాపై కపిరాజు" అనే రాగయుక్తమైన పద్యం చెబితే, పల్లె ప్రజలంతా 'భళా'అనేవాళ్ళు.

"కోడి పందేలొచ్చినాయి...కోపులే లేసినాయి... పోయెస్త జానకీ కోడిపందెమూ...నేను పోయెస్త జానకీ కోడిపందెమూ" అని ఊగి ఊగి పాడే జానపదగేయాన్ని విని, ఊగిపోని వాళ్ళెవరుంటారు. ఆయన మాట సాగిన న్నాళ్ళూ, సంగీత,సాహిత్య సభలకు కొదవలేదు. కట్టని వేషం లేదు. పాడని పాటలేదు. చెప్పని పద్యమూ లేదు.

సత్యనారాయణకు ఇద్దరు కొడుకులు. అల్లారుముద్దుగా పెంచిపెద్ద చేశాడు. పెళ్ళిళ్ళు చేశాడు. తన కళలకు ఆకృతి నిచ్చేలా ఓ పెద్ద భవంతి కట్టించాడు. గేటుకు ఎదురుగా పెద్ద వసారాతో పెద్దఇళ్ళు. అది తన స్వంత నివాసానికి. కుడివైపున పదిసెంట్లలో అందమైన ఇళ్ళు. అది తన పెద్దకొడుకు సురేష్‌కి. ఎడమవైపున అంతే విశాలంతో మరో ఇళ్ళు. అది తనచిన్నకొడుకు వెంకటనారాయణకు. ఇద్దరూ వ్యవసాయంలో దిట్టలైపోయారు. ఎవరిపని వాళ్ళు చేసుకుంటున్నారు. కానీ డబ్బు పెత్తనమంతా సత్య నారాయణదే. కోడళ్ళకు గిట్టని విషయం కూడా అదే. ఆస్తులు పంపకం చేయమని పట్టుబట్టారు కొడుకులు. సత్యనారాయణకిది కొరుకుడు పడని విషయం.

పంపకాలు అనే విషయం ఒక ఉత్తమకుటుంబాన్ని చిల్లరపాలు చేస్తుందన్నది సత్యనారాయణ భావం. తనకంటూ ఓ ప్రత్యేకత ఉంది. పేరుప్రతిష్ఠలన్నీ పటాపంచలైపోతాయి...పేరు పోయిన తర్వాత మనిషి ఉండి మాత్రం ఏమిలాభం" అనుకుంటాడు. కొడుకులు అంగీకరించరు.

ఒకరోజు ఇద్దరు కొడుకులూ వచ్చారు. తన సమక్షంలో ఇద్దరూ పంపకాల విషయం మాట్లాడటం అదే మొదటిసారి.

"నాన్నా...ఆస్తిపాస్తులు పంపకం చేస్తే బాగుంటుంది గదా! ఎన్నాళ్ళా ఇట్లనే ఉండలేం...ఉన్న భూమిని చెరిసగం, ఉన్న డబ్బును చెరిసగం పంచి, మీకు ఎవరి దగ్గరిష్టమో వాళ్లదగ్గరుండచ్చుకద నాన్న" అన్నాడు పెద్ద కొడుకు సురేష్.

"ఆస్తి పంచితే 'ఇది నా ఆస్తి' అని చెప్పుకునేందుకయి నా బాగుంటుంది. మా భార్యలు, అత్తమామగారు గూడా 'నీకంటూ ఏ ఆస్తి ఉంది?'అని నిలదీస్తుంటారు. మీరు ఆస్తి పంచితే, అట్లా చెప్పేందుకన్నా బాగుంటుంది. కాబట్టి, ఆస్తి పంచివ్వండి నాన్నా..."అన్నాడు చిన్నకొడుకు వెంకటనారాయణ.

ఏం చెబుతాడోనని ఎదురుచూస్తున్నారు ఇద్దరూ.

మెల్లగా కుర్చీలోంచి లేచాడు. దగ్గరగా వెళ్ళి ఇద్దరినీ దగ్గరకు చేర్చుకున్నాడు. ఇద్దరి భుజాలపై చేతులేసుకున్నాడు. వసారాలోంచి ముగ్గురూ అలాగే ఇంట్లోకి దారి తీసారు. "కనకం...మాకు అన్నం వడ్డించు" అన్నాడు సత్యనారాయణ.

కనకమ్మ ముఖంలో ప్రశ్నార్థకం.

"ప్రతిరోజూ పంపకాల విషయమై పెద్దమనుషులతో చెప్పించే వీళ్ళు...అయ్యగారిని పంపకాల విషయమై, రచ్చబండదాకా లాగిన వీళ్ళు..వీళ్ళకు అయ్యగారు అన్నం పెట్టమంటున్నారా...అయ్యో ఇదేందయ్యా...! పగబట్టిన పాముకు గూడా పాలు పొయ్యడమంటే ఇదేనేమో!"

అయ్యగారు పంపకాలు చెయ్యనంటే "ఈ ఊరు విడిచి పో...పో...అని తరిమేసే వీళ్ళు..తల్లిపోయింది మొదలు, అయ్యగారే తల్లె,తండ్రె, కంటికి రెప్పలా చూసుకుని, పెంచి,పెద్దచేసి. పెండ్లిండ్లు చేసి, 'వీళ్ళు నాకొడుకులు' అంటూ చెప్పుకొని గర్వపడుతూ ఉంటే– 'ఇలాంటి ముసి

లాళ్ళు ఈ భూమికే బరువు, తరిమెయ్యమని పురమాయించే వీళ్ళు-వీళ్ళకు అయ్యగారు అన్నం పెట్టమంటున్నారా...!అయ్యో- ఇదేందయ్యా-తలదూరిస్తే చనిపోతామని తెలిసీ, పుటినోట్లో తలదూర్చమంటే ఇదేనేమో...!" అని కొడుకుల వ్యవస్థనే చీదరించుకొంటూ, సత్యనారాయణ వైపు అనుమానంగా చూసింది కనకమ్మ.

"అన్నం వడ్డించు కనకం...ఎందుకట్ల చూస్తావు" అన్నాడు ఆజ్ఞాపిస్తున్నట్లుగా సత్యనారాయణ.

కనకమ్మ వడ్డించింది...ముగ్గురూ భోంచేశారు. వచ్చి వసారాలో కూర్చున్నారు.

"పెద్దమనుషులు ఏం చెప్పారు?"...అన్నాడు నింపాదిగా సత్యనారాయణ.

"ఆస్తులు పంచే ప్రసక్తే లేదని మీరన్నట్లు చెప్పారు-" అన్నారు కొడుకులు.

"అవును...నిజమే..ఆస్తిని పంచను"అన్నాడు.

"పంచకపోతే మాకంటూ ఏముంటుంది. మా తరపున వాళ్ళకు మేమేం చెప్పుకోవాలి...?"అన్నాడు పెద్దకొడుకు.

"ఇదంతా మీదేనని చెప్పుకోండ్రా...ఎవరొద్దన్నారు?" అన్నాడు నాన్న..

"అదెట్ల...మావి మాకు రాయిస్తేగదా, అది మాదయినట్లు"అన్నాడు చిన్నోడు.

"అట్లేం కుదర్దు...నేను రాసీను"బల్ల గుద్దినట్లుగా నొక్కి చెప్పాడు నాన్న.

"నేను పంచియ్యకుంటే నన్ను ఊరు విడిచి పొమ్మన్నారంట...ఎందుకు పోవాల్రా..."సత్యనారాయణ నిలదీశాడు కొడుకుల్ని.

"కొడుకుల ఆదరణకు నోచుకోని తండ్రులంతా పోతున్నారా, లేదా. అందరి తిన్ననే, నువ్వూ...ముసిలోల్లయినా బింకం యాడికి పోదూ. అన్ని కాలాలూ నీ మాటలే చెల్లుతాయనుకున్నావా..."పెద్దకొడుకు ఎదిరిస్తున్నట్లుగా మాట్లాడాడు.

సత్యనారాయణ కొడుకు వైపు తీక్షణంగా చూశాడు.

"అందరిలాగే నేనూనా...కాదు. కానేకాదు...ఒరేయ్. మీకు తెలుసోలేదో...మానాన్న పోతూపోతూ ఒక్క పాతికసెంటు భూమికూడా ఈలేదు. పాతికరూపాయలు కూడా మిగిలీలేదు. ఇప్పుడున్న ఈ డెబ్బై ఎకరాలూ నా కష్టార్జితమే...ఇప్పుడున్న ఈ మేడ, ఈ లక్షల ఆస్తి అంతా నా కష్టార్జితమే. నేను వ్యాపారం చేసి సంపాదించిందే. మీరున్న ఇళ్ళు, మీరు చేస్తున్న భూములు అన్నీ నావే. ఇదంతా నాదేరా. అదిగో అటుచూడు..ఆ అటక మీదున్న చెక్కపెట్టె ఒకటే మానాన్న పోతూ పోతూ నాకు ఇచ్చాడు. ఆ పెట్టెతోనే ఇంత వ్యాపారం సాగించాను. ఇంత డబ్బు సంపాదించాను. పేరు, ప్రతిష్ట, పలుకుబడి, అన్నీ...అన్నీ, ఆ పెట్టెతోనే సంపాదించాను. అయినా మీకిదంతా చెప్పాల్సిన అవసరం నాకు లేదు. మీకు ఎప్పుడో చెప్పాను- మనిషి ప్రతి ఒక్కడు తనకంటూ ఒక ప్రత్యేకమైన శైలి అలవర్చుకోవాలని...ఒక వృత్తిలో అంకితమైపోవాలని. దానిలోతుపాతులు చూడాలి...మమైకం చెందాలి...మారిపోవాలి...అందనంత ఎత్తుకు ఎదగాలి...అలాంటిదే నా మనస్తత్వం. నన్నెవ్వరూ అంచనా వెయ్యకూడదనుకుంటాను. నా స్థాయిని నలుగురూ మెచ్చాలనుకుంటాను. ఆ మనస్తత్వమే నన్ను ఈ స్థాయికి తెచ్చింది., ఇంతవాడిని చేసింది. మరి అలాంటప్పుడు- అందరిలాగే నన్నూ ఇళ్ళు వదలి పొమ్మంటారా...ఒరేయ్ తండ్రిని చూసుకోవడం నేర్చుకోండ్రా...రక్తం పంచుకుని పుట్టడం కాదు...ఆ పంచిచ్చిన రక్తాన్ని తన రక్తంతో సమానంగా చూసుకోవడం నేర్చుకోండి...ఎందుకురా మీకు ఈ దురాలోచన వచ్చింది..."అన్నాడు ఆవేశపడిపోతూ సత్యనారాయణ.

"నువ్వు చెప్పేదంతా మాకు తెల్సుగాని, ఈ కాకమ్మ కబుర్లు, నీతివాక్యాలు...వినే ఓపిక మాకు లేదు. ముందు ఆస్తులు పంచే యవ్వారం చూడు. లేకుంటే బాగుండదు" బెదిరిస్తున్నట్లుగా మాట్లాడి విసురుగా వెళ్లిపోయారు ఇద్దురూ....

"మారుతున్న తరంలోని అంతరంగాల్ని అంచనా వేయలేకపోతున్నానా" అనుకున్నాడు సత్యనారాయణ. "ఏమిటో ఈ తరం భావం..ఆస్తులు పంచివ్వకూడదనికాదు. పంచివ్వాల్సిందే..కానీ ప్రతికొడుకూ తన తండ్రి సంపాదించిన ఆస్తులపైనే ఆశలమేడలు కట్టుకొంటారు. తనకు తానుగా బతకాలనుకోడు. తనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలనుకోడు. ఎప్పుడూ ఒకరి ఆలంబన అవసరమనుకుంటారు. ఎందుకిట్ల తయారయ్యారు? ఎక్కడ లోపం జరిగింది? తల్లిదండ్రుల్లోనా...కొడుకుల్లోనా, లేక సమాజం మొత్తంలోనా...ఈ అలవాటు మాన్పించాలి.. లేదా కథ అడ్డం తిరిగేట్లుంది"కుర్చీలో కూర్చున్న సత్యనారాయణ మనసునిండా ఆలోచనలే.

బెదిరిస్తున్నట్లు మాట్లాడి వెళ్లిన కొడుకులు, పంపకాల విషయమై రచ్చబండ మీద ఎన్నోసార్లు పెద్దమనుషులతో పంచాయితీలు పెట్టించారు. పంచాయితీ కొన్ని విషయాల్ని బల్ల గుద్ది చెప్పింది.

తండ్రి ఆస్తుల మీద కొడుకులకు తప్పనిసరిగా హక్కు ఉంటుందట.

ఆస్తులు ఇవ్వకపోతే కోర్టునుండి గూడా బలవంతంగా తీసుకోవచ్చునట.

సత్యనారాయణగారి పెద్ద ప్రహారీ గోడను పగులకొట్టి, మూడు ప్రత్యేక ద్వారాలను ఏర్పాటు చేయాలట.

ఉన్న భూమినంతటిని పంపకం చేసి, ముసలాయన జీవనానికి ఐదెకరాలు మాత్రమే ఉంచాలట.

పంపకాలకోసం ఇంతగా సతాయించిన తండ్రిని ఏ ఒక్కకొడుకూ తన వద్ద ఉంచుకోవటానికి ఒప్పుకోరట.

సత్యనారాయణ తన ఇష్టం వచ్చినట్లు బతికెయ్యవచ్చుట. ఈ విషయాలకు ఒప్పుకోకపోతే ఊరు విడిచిపోవాలట. లేకుంటే తరిమేస్తారట.

సత్యనారాయణ మనసునిండా ఈ సూచనలే. మనసు మనసులో లేదు. "మనిషి మనిషిగా బతకటం ఎప్పుడు నేర్చుకుంటాడో..? డబ్బు సంపాదించేది చేతకాక దరిద్రుడిగా ఉంటే సహాయం చేసే నాథుడే ఉండడు. అలాగని సంపాదిస్తే దానికి పంగనామాలు పెట్టే మూలపురుషులెందరో?! ఈ పెద్దమనుషులంతా ఎవరు? వీళ్ళకేంది నేను సమాధానం చెప్పేది. చేసేది చేసి చూపించాలి. అది వచ్చే తరానికయినా మంచి జరుగుతుంది"అనుకున్నాడు సత్యనారాయణ మనసులో.

"అయ్యగారూ..."కనకమ్మ పిలుపు, ఆలోచనలకు తెర వేసింది...మౌనంగా కనకమ్మ వైపు తలతిప్పాడు.

"రాత్తిరి నుంచి ఇంగా పండుకోనేలేదే..ఇట్లయితే మీరెన్నాళ్ళు బతుకుతారు"అంది కనకమ్మ.

సమాధానంగా నవ్వు...ఆ నవ్వులో జీవకళ లేదు. పాలిపోయింది.

"అయ్యగారూ...మనసులు ఎన్నిరకాలు...అసలు ఈల్లు మనుసులేనా...? సొంతం నాయన్నే పో, పో, అంటారే...ఈల్లేం కొడుకులు సామి. ఏం పొయ్యే కాలమొచ్చిందో..ఇంతకు రేపు ఆకిరీ పంచాయితీలో ఏమి సెప్పాలనుకుంటున్నారు..."సమాధానం కోసం ఎదురుచూస్తూ అడిగింది కనకమ్మ...

"కనకం...నా మనసేమీ బాగలేదు...ఏమి చెప్పను.. పొయ్యి పండుకో..."అన్నాడు సత్యనారాయణ.

"నా మనసు గూడా ఏమి బాగలేకనే ఒచ్చినా...మిమ్మల్ని వేధిస్తున్న ఈ పంచాయితీలు...ఈ కొడుకులు...ఛీ ఛీ ఛీ ఛీఛీ...అదిగాదయ్యా...నాకు తెలీకడుగుతా...ఏమి లెక్క, ఏమి ఆస్తి...వాళ్ళకే ఇచ్చిపారెయ్...పీడపోతుంది. మీ మనసన్నా నిమ్మలంగా ఉంటుంది..."సలహా ఇస్తున్నట్టుగా చెప్పింది కనకమ్మ.

"పోయ్ పండుకో కనకం"అన్నాడు విసిగించుకొంటున్న వాడిలా.

కాదనలేక వెళ్ళిపడుకుంది.

మళ్ళీ ఆలోచనలు ముసురుకొస్తున్నాయి.

"ఇంత ఆస్తిని, బంగళాని విడిచి వెళ్లిపోవాలా?..." ఆ పని నేను చెయ్యగలనా..."అనుకున్నాడు.

కుర్చీలోంచీ లేచాడు. చుట్టూ ఉన్న గోడల్ని తడిమినాడు. అణువణువునా తన ఉనికి. నగిషీలు చెక్కిన ద్వారబంధాన్ని ఆనుకున్నాడు. వాకిటిపైన తండ్రి తైలవర్ణచిత్రం...చెరగని చిరునవ్వు...చెక్కపెట్టెను స్వహస్తాలతో అందిస్తున్నట్లుంది. చెక్కలపై కన్నీటిబొట్లు బొటబొటారాలాయి.

ఏదో విడిపోతున్న అనుభూతి...బాధ...రొద.

తనని బజారుపాలు చేస్తున్నందుకు కాదు...

సంస్కృతికి కలంకం తెస్తున్నందుకు.

తన ఆస్తి సర్వస్వం కోల్పోతున్నందుకు కాదు.

సాంప్రదాయాల్ని కాలరాచే సమాజస్థితిగతుల్ని చూస్తున్నందుకు. ఆలోచనలతో అలసి సొలసి అలాగే నిద్రలోకి జారుకున్నాడు.

* * *

ఉదయం పదిగంటలు దాటింది. పంచాయితీ ప్రారంభమయింది. "ఏం సత్యనారాయణ...ఆస్తిని కొడుకులకు పంచిచ్చేయ్...ఎందుకింత రభస...ఎప్పుడయినా పంచాల్సిందే గదా...!" అన్నాడు పంచాయితీ పెద్దమనిషి.

"సూడూ...మీరంతా నాకేం చెప్పబండ్లా...నాకూ తెల్సు...జీవితమంతా పిల్లలకు ధారపోసిన తండ్రులు నూటికి తొంభైమంది మనోవ్యధతో బజారుపాలవుతున్నారు. ఇది నిజం. అలా కావటం నాకు ఇష్టంలేదు. జన్మనిచ్చాం. పెంచాం. పెద్దచేశాం. పనినేర్పాం. అన్నీ చేశాం. వారి కాళ్ళపై వాళ్ళను నిలబడేలా చేశాము...అంతే...

ఏ తండ్రి అయినా అంతవరకే చేయాలి. ఆపై వాడే బతకాలి. వాడిని వాడే పోషించుకోవాలి. వాడే సంపాదించుకోవాలి. అంతేగాని, ఎప్పుడూ తండ్రిగారి సంపాదన తనకు కావాలని, పంచివ్వాలని కోరుకునే మనస్తత్వాన్ని దూరం చెయ్యాలి. అలాంటి సంస్కృతి మాసిపోవాలి. లేకుంటే, వచ్చే యువతరం, తమ వెనుక తండ్రి, తాతల ఆస్తి ఉందనే ధీమాతో, సోమరితనాన్ని పోషిస్తారు. వద్దు....ఇకపై ప్రతి తండ్రి తన ఆస్తిని పంచివ్వడు. బజారుపాలుకాడు. ఏ కొడుకైనా సరే తనకు తాను బతకటం, సంపాదించుకోవటం నేర్చుకోవాలి. ఒకరి ఆస్తి రావాలి, ఆలంబన కావాలి...అనే యోచన వాళ్ల మనసుకే రాకూడదు...

అందుకే నేను నా వాళ్ళకు నా ఆస్తినివ్వను. ఇవ్వనన్నా నన్ను వేధిస్తున్నారు గనుక ఒక నిర్ణయానికి వచ్చాను. నాకున్న యావదాస్తిని రామకృష్ణచారిటబుల్ ట్రస్ట్‌కి రాయిస్తున్నాను. నేను ఉంటున్న ఆ ఒక్క ఇల్లు మాత్రం మా పనిమనిషి కనకమ్మకు చెందేలా రాయిస్తున్నాను. నా కొడుకులు ఉంటున్న ఇళ్ళలో నుండి వెళ్లిపోవటానికి ఒక వారం గడువిస్తున్నాను. ఇవన్నీ న్యాయబద్ధంగానే చెల్లుబాటు అవుతాయని చెప్పటానికి, ఇక్కడ లాయర్ గూడా ఉన్నాడు. ఇదే నా నిర్ణయం...రేయ్...పొండిరా... వెళ్ళిపొండి..."

ధీమాగా రచ్చబండ దిగి దోవతి సర్దుకుంటూ ఇంటిదారి పట్టిన సత్యనారాయణవైపు - ఎంతో, ఎంతెంతో నేర్చుకుంటున్నట్లుగా కొడుకులు, పెద్దమనుషులు...పల్లె ప్రజలు, రచ్చబండ చూస్తూండిపోయారు.